సాక్షి మహబూబాబాద్

మంగళవారం | 5 | డిసెంబర్ | 2023



సైబర్ చోర్.. జరభద్రం

రోజురోజుకూ ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయి. కేటుగాళ్ల ఉచ్చులో పడి బాధితులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు.

- 8లో▸



'కత్తెర'కాటు..

యాసంగిలో మొక్కజొన్న పంటను కత్తెర పురుగు కాటు వేస్తోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

34.5^0 / 20.7^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల నిర్వహణ విజయవంతం

- కలెక్టర్ శశాంక
- అధికారులకు అభినందనలు

మహబూబాబాద్: జిల్లాలో డోర్నకల్, మానుకోట నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ విజయవంతంగా చేపట్టామని, అధికారులు సమన్వయంతో పనిచేశారని కలెక్టర్ శశాంక సోమవారం ఒక ప్రకటనలో అభినందించారు. జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు నిర్విరామంగా అధికారులు పని చేశారన్నారు. ఇంజనీరింగ్, విద్యుత్, వైద్య, ఇతర శాఖల సిబ్బంది, మీడియా సిబ్బందికి, పోలింగ్ పెద్ద ఎత్తున తరలివచ్చిన ఓటర్లకు, సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం..



మహబూబాబాద్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 2018తో పోలిస్తే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎనిమిది సీట్లు సాధించిందన్నారు. మోదీ పాలనను ప్రజలు ఆదరిస్తున్నారని, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకటేనని కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసిందన్నారు. మానుకోటలో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఐదు సంవత్సరాల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని, ఇచ్చిన హామీలను కూడా పూర్తిగా నెరవేర్చాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, జిల్లా కార్యదర్శి పేరాల సంపత్ రావు, మహిళా ఉపాధ్యక్షురాలు పద్మ, సయ్యద్ రేష్మ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఈనెల 10వ తేదీన రాష్ట్రస్థాయి జాతీయ ఉపకార వేతనాల ప్రతిభ పరీక్ష (ఎన్ఎంఎంఎస్) నిర్వహిస్తున్నట్లు డీఈఓ రామారావు సోమవారం తెలిపారు. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తున్నామని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.తెలంగాణ.గౌట్.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ విద్యార్థి పరీక్షకు హాజరుకావాలని, వివరాలకు ఏసీజీఈ మందుల శ్రీరాములు 98497 61012 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం బేస్‌బాల్ ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్ 14, 17విభాగంలో బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేలా పీఈటీలు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు ఓలేటి జ్యోతి, బేస్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ కల్లూరి ప్రభాకర్, షార్ట్ బాల్ జిల్లా సెక్రటరీ సమ్మెట ప్రేమ్ కుమార్, పీఈటీలు ముఖర్జీ, సుమలత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం




కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సోమవారం ధాన్యం పోటెత్తింది. 28,329 బస్తాల ధాన్యం అమ్మకానికి రాగా, షెడ్లు, ఓపెన్‌యార్డు రాశులతో నిండిపోయాయి. ఈ సీజన్‌లో అత్యధికంగా ధాన్యం రావడం ఇదే మొదటిసారి అని మార్కెట్ అధికారులు తెలిపారు. అధికంగా ధాన్యం రావడంతో టెండర్లు, కాంటాలు ఆలస్యమయ్యాయి. రాత్రి వరకు సగం వరకు ధాన్యమే కాంటాలు, తొలకాలు జరిగాయి. వర్ష సూచన ఉండడంతో పలువురు రైతులు ముందస్తుగా టార్పాలిన్లు, పరదాలను ధాన్యంరాశులపై కప్పుకుని జాగ్రత్తపడ్డారు. కాగా వర్షసూచన కారణంగా మంగళవారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసిని తెలిపారు. ధాన్యం(ఆర్ఎన్ఆర్ కొత్తవి) క్వింటాకు గరిష్ట ధర రూ.3,359, కనిష్ట ధర రూ.2,009 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

మంత్రులు ఎవరో..?!

ఢిల్లీలో ఏఐసీసీ కసరత్తు.. నేడు ప్రకటించే అవకాశం

- ఉమ్మడి వరంగల్‌కు ఒక్కరా.. ఇద్దరా!
- రేసులో ధనసరి సీతక్క, కొండా సురేఖ
- పరిశీలనలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేరు కూడా?
- కాంగ్రెస్ ఎల్‌పీ నేతల భేటీతో జిల్లాలో చర్చ
- రాత్రి వరకు తేలని సీఎల్‌పీ నేత ఎంపిక.. మంత్రుల జాబితా నేడు తేలే అవకాశం



కొండా సురేఖ

సీతక్క

రేవూరి ప్రకాశ్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్: 'తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసే ప్రభుత్వంలో తొలి కేబినేట్‌లో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి అవకాశం దక్కుతుంది? 18 మంది మంత్రివర్గ సహచరులతో కొత్త సీఎం పరిపాలన చేయనున్న నేపథ్యంలో జిల్లాలో ఎందరికి అవకాశం దక్కనుంది? జిల్లాలో మొత్తం 10 స్థానాల నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో ఎవరిని మంత్రి పదవి వరించనుంది?' ఇదీ ఉమ్మడి వరంగల్‌లో సర్వత్రా సాగుతున్న చర్చ. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిందే తడవుగా ప్రభుత్వం ఏర్పాటులో భాగంగా సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని హోటల్ ఎల్లాలో ఏఐసీసీ నేతలు మాణిక్‌రావు ఠాగూర్, డీకే శివకుమార్, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, నేతలు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులతో పాటు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఏకవాక్య తీర్మానంతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు నిర్ణయాధికారం అప్పగించారు. సాయంత్రం వరకు సీఎల్‌పీ నేత ఎంపిక పూర్తవుతుందని భావించినా.. అది మంగళవారానికి వాయిదా పడింది. సీఎల్‌పీ నిర్వహించిన ఏఐసీసీ పరిశీలకులకు ఢిల్లీ నుంచి ఆహ్వానం అందింది. సీఎల్‌పీ నేత ఎంపికతో పాటు మంత్రివర్గ కూర్పు కూడా అక్కడే జరగనున్న నేపథ్యంలో.. ఆజాబితాలో జిల్లా నుంచి ఎవరుంటారు? ఉమ్మడిజిల్లా నుంచి మంత్రిగా ఎవరికి అవకాశం దక్కుతుందనేది చర్చనీయాంశంగా మారింది.

మంత్రి రేసులో సీతక్క, సురేఖ

ఉమ్మడి వరంగల్‌లో 12 అసెంబ్లీ స్థానాలకుగాను 10 చోట్ల కాంగ్రెస్ విజయం సాధించగా.. ఇక్కడి నుంచి ఇద్దరికి అవకాశం లభించవచ్చంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌కు మంత్రి పదవులు దక్కాయి. ఈనేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇద్దరికి అవకాశం ఉంటుందంటున్నారు. ములుగు నుంచి వరుసగా రెండోసారి 33,700 పైచిలుకు ఓట్లతో గెలిచిన ధనసరి సీతక్కకు మొదట కీలకమైన మంత్రి పదవి వరించనుందనే చర్చ జరుగుతుండగా.. రెండో మంత్రి కోసం కొండా సురేఖ రేసులో ఉన్నట్లు చెబుతున్నారు.

- ములుగు మండలం జగ్గన్నపేటకు చెందిన వ్యవసాయకూలీల కుటుంబంలో పుట్టిన సీతక్క రాజకీయాల్లోకి రాకముందు జనశక్తి పార్టీకి సంబంధించిన అజ్ఞాత దళంలో దళ కమాండర్‌గా పని చేశారు. ఆతర్వాత జనజీవన స్రవంతిలో కలిసి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. న్యాయవాదిగా వరంగల్ కోర్టులో ప్రాక్టీసు చేశారు. అనంతరం రాజకీయ రంగ ప్రవేశం చేసి రెండుసార్లు ములుగు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మూడోసారి గెలిచి కీలక నాయకురాలిగా ఎదిగిన ఆమెను రేవంత్‌రెడ్డి దేవుడిచ్చిన ఆడబిడ్డగా చెప్పారు. ఏఐసీసీ అధిష్టానంలోనూ మంచిపేరున్న ఆమెకు మంత్రి పదవి ఖాయమైనట్లే అంటున్నారు.
- రెండో మంత్రి పదవి కోసం వరంగల్ తూర్పు నుంచి గెలుపొందిన కొండా సురేఖ ప్రయత్నంలో ఉన్నారు. బీసీ(పద్మశాలి) సామాజిక వర్గానికి చెందిన కొండా సురేఖ ఎంపీటీసీ నుంచి మంత్రి వరకు అనేక పదవుల్లో కొనసాగారు. గీసుకొండ ఎంపీపీగా, 1999, 2004 శాయంపేట ఎమ్మెల్యేగా, 2009 పరకాల, 2014లో వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా, 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్ కేబినెట్‌లో రాష్ట్ర మంత్రిగా పని చేశారు. భర్త కొండా మురళి సహకారంతో రాజకీయాల్లో రాణించి ఆమె కూడా ఈసారి వరంగల్ తూర్పు నుంచి గెలిచి మంత్రి పదవి ఆశిస్తున్నారు.
- టీడీపీ నుంచి 1994, 1999, 2004లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవూరి ప్రకాశ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి ఈ ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేసి ఘన విజయం సాధించారు. సీనియర్ నేత, శాసనసభ్యుడిగా ఉన్న రేవూరి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

7న ప్రమాణ స్వీకారం చేసే అవకాశం..

సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని హోటల్ ఎల్లాలో ఏఐసీసీ నేతలు మాణిక్‌రావు ఠాగూర్, డీకే శివకుమార్.. ఎమ్మెల్యేలతో భేటీ అయిన నేపథ్యంలో సీఎల్‌పీ నేత, సీఎం పేరు ప్రకటిస్తారని అందరూ భావించారు. ఏకవాక్య తీర్మానంతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు నిర్ణయాధికారం అప్పగించిన కొద్ది గంటల్లో సీఎల్‌పీ నేత ఎంపిక పూర్తయి కొత్త సీఎం రాత్రి 8.30 గంటలకు ప్రమాణస్వీకారం పూర్తవుతుందనకున్నారు. పూర్తిస్థాయిలో మంత్రివర్గంతో సోనియాగాంధీ జన్మదినం రోజున లాల్‌బహదూర్ స్టేడియంలో ప్రమాణ స్వీకారం ఉంటుందని కాంగ్రెస్ పెద్దలు ప్రకటించారు. సీఎల్‌పీ నేత ఎంపికపై స్పష్టమైన ప్రకటన రాకపోగా.. అందుకు భిన్నంగా ఏఐసీసీ పరిశీలకులుగా ఉన్న డీకే శివకుమార్, మాణిక్‌రావు ఠాగూర్ తదితరులకు ఢిల్లీకే రావాల్సిందిగా అధిష్టానం సూచించడంతో హుటాహుటిన బయల్దేరి వెళ్లారు. ఢిల్లీలోనే మంగళవారం సమావేశం కానున్న ఏఐసీసీ, టీపీసీసీ నేతలు.. సీఎంతో పాటు మంత్రివర్గం కూర్పుపై తేల్చనున్నారని సమాచారం. కాగా ఇప్పటికే సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు ఖరారైందని, 5, 6 తేదీల్లో మంచిరోజులు లేకపోవడంతో 7న ఉదయం 10 గంటలకు కొత్త సీఎం ప్రమాణస్వీకారం ఉంటుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ నుంచి ఎంపికయ్యే మంత్రులు కూడా అదే రోజు ప్రమాణం చేసే అవకాశం ఉందని పార్టీవర్గాల సమాచారం.

ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తాం

- మహబూబాబాద్ ఎంపీ కవిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కవిత

మరిపెడ: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత అన్నారు. సోమవారం మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రెడ్యానాయక్‌కు కేసీఆర్ బీఫాం ఇచ్చిన నాటి నుంచి గెలుపుకోసం కృషి చేసి కార్యకర్తలందరికీ ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. ఓడిపోయినప్పటికీ కార్యకర్తలు ఎవరుకూడా అధైర్యపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని ఎంపీ భరోసా కల్పించారు. డోర్నకల్‌లో గెలిచిన ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్‌కు ఆమె అభినందనలు తెలిపారు. కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని, ప్రజలు ఈ విధంగా తీర్పు ఇస్తారని ఊహించలేదన్నారు. డోర్నకల్‌లో ఎమ్మెల్యేగా రెడ్యానాయక్ అన్ని అభివృద్ధి పనులు చేసినప్పటికీ ఓడించడం బాధగా ఉందన్నారు. చిన్నచిన్న లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకొని ముందుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, మున్సిపాలిటీ చైర్మన్ గుగులోతు సింధూర, ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు, జెడ్పీటీసీ తేజావత్ శారదరవీందర్ నాయక్, రామడుగు అచ్చుత్‌రావు, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఉప్పల నాగేశ్వర్‌రావు, రైతు సమితి జిల్లా నాయకులు జర్పుల కాలునాయక్, శ్రీపాల్‌రెడ్డి, పానుగోతు వెంకన్న, లతీఫ్, మక్సుద్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థుల్లో అభ్యసన, భాషా సామర్థ్యాలు పెంచాలని డీఈఓ రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పాఠశాల హెచ్ఎంలకు ఒకరోజు శిక్షణ నిర్వహించగా డీఈఓ హాజరై మాట్లాడారు. బోధనలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులను తీర్చిదిద్దేందుకు ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్, లక్ష్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ విద్యార్థి చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.


ఆకస్మిక తనిఖీ

కురవి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను డీఈఓ రామారావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థుల చదువు సామర్థ్యాలను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ నిర్వహణను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు.

అంతర్మథనం..

ఓటమిపై లెక్కలు వేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

- పార్టీలో అంతర్గత విభేదాలే ముంచాయని చర్చ
- క్యాడర్‌ను కాపాడుకునేందుకు లీడర్ల ప్రయత్నాలు



సాక్షి, మహబూబాబాద్: గెలుపోటములు సహజమే.. కానీ జిల్లా చరిత్రలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఎవరు చవిచూడని పరాజయం ప్రస్తుతం ఎదురైంది. ప్రజలకు చేరువలో ఉంటూ.. ప్రజా సంక్షేమ పథకాలను అందించిన కూడా ఇలా ఎందుకు జరిగింది.. దీనికి కారణాలు ఏమిటి.. ప్రజల్లో ఇంత వ్యతిరేకత ఎందుకు వచ్చింది అనేది బీఆర్ఎస్ అభ్యర్థులు, కార్యకర్తల్లో చర్చ. వ్యతిరేక పవనాలు ఇలాగే వీస్తే రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పార్టీ కనీస ఉనికి కూడా లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. ఇందుకు కారణాలు ఏంటని తెలుసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

పరాజయంపై బీఆర్ఎస్ ఆరా..

జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలతో పాటు ఇల్లెందు, పాలకుర్తి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఓటమిపాలు కాగా.. ములుగు నియోకవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన సీతక్క స్థానం పదిలంగా ఉంది. గెలిచిన వారిలో కోరం కనకయ్య మినహా ముగ్గురు కొత్తవారే. ఇందుకు కారణాలు ఎవరికి వారుగా చెప్పుకొస్తున్నారు. అయితే ఎమ్మెల్యేలు అతిగా నమ్మిన నాయకులు వారివారి మండలాల్లో సక్రమంగా పనిచేయకపోవడం.. సంక్షేమ పథకాల అమలులో చేత వాటం ప్రదర్శించడం, పథకాలను అర్హులకు కాకుండా వారి అనుచరులు, కుటుంబ సభ్యులకు ఇవ్వడం వంటి కారణాలు ప్రజల్లో వ్యతిరేకతకు తావిచ్చాయని ఆరోపణలు వస్తున్నాయి. అదేవిధంగా తాము తప్పులు చేసినా.. ఆ తప్పుకు ప్రధాన నాయకుడినే బాధ్యులను చేయడం, తప్పులు చేసిన వారిని వెనకేసుకొచ్చి ఆ ఒక్కరి కోసం ఊరంతా వ్యతిరేకులను చేసుకున్న ఘటనలు ఉన్నాయి. చివరకు ఎన్నికల్లో డబ్బుల పంపిణీ విషయంలో కూడా నమ్మిన నాయకులు చేతివాటం ప్రదర్శించారని, అందుకోసమే ఓట్లు తక్కువగా వచ్చానే ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు నమ్మిన నాయకుల గ్రామాలు, వార్డుల్లో కాంగ్రెస్‌కు భారీగా ఓట్లు రావడంతో కంగుతినాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎవరిని అనుమానించాలో.. ఎవరిని నిలదీయాలో తెలియక బీఆర్ఎస్ అభ్యర్థులు లోలోపల కుమిలిపోతున్నారు.

క్యాడర్‌ను కాపాడుకునేందుకు..

ఓటమి బాధ ఒక వైపు ఉండగా.. మరోవైపు ఇంత కాలం తమ వెంట ఉన్న క్యాడర్‌ను కాపాడుకోవడం తలనొప్పిగా మారింది. ఇప్పటికే పట్టణాలతో పాటు మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధుల్లో అత్యధిక మందికి చేసిన పనుల బిల్లులు రాలేదు. నిన్నటి వరకు వ్యతిరేకంగా పనిచేసిన తమపై గెలిచిన నాయకులు కక్షకట్టుకొని బిల్లులు రాకుండా చేస్తే తమ పరిస్థితి ఏమిటని ఆందోళనలో ఉన్నారు. అదేవిధంగా కొందరు గోడమీది పిల్లిలా వ్యవహరించి గెలిచిన వారికి జై కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో క్యాడర్‌కు అండగా ఉంటామని ధైర్యం చెబుతున్నారు. ఇందుకోసం మహబూబాబాద్ తాజా మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మరిపెడలో ఎంపీ మాలోతు కవిత విలేకరుల సమావేశం పెట్టి క్యాడర్‌లో ధైర్యం నింపారు. అండగా ఉంటాం.. ఆందోళన చెందవద్దని చెప్పారు.

కలిసిరాని సొంత పార్టీ నాయకులు

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీయడం, దీనికి తోడు జిల్లా బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు అభ్యర్థుల ఓటమికి ముఖ్య కారణాలు వాదనలు కూడా వినిపిస్తున్నాయి. మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకు టికెట్ ఇవ్వడంతో వారికి వ్యతిరేక వర్గం పనిచేయలేదనే విమర్శలు వస్తున్నాయి. అందుకోసమే కాంగ్రెస్ అభ్యర్థులకు భారీ మెజార్టీ వచ్చిందని ఆ పార్టీలో చర్చ. ఈ విషయంపై పలువురు అభ్యర్థులు సొంత పార్టీలోని నాయకులే మోసం చేశారని, అందుకోసమే ఓటమిపాలయ్యామని బహిరంగ ప్రకటనలు చేయడం గమనార్హం. అయితే ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు పట్టించుకోలేదని, కనీసం ప్రచారానికి కూడా పిలువలేదని, తమ క్యాడర్‌ను దగ్గరకు రానివ్వలేదని నాయకులు చెబుతున్నారు. ఇన్ని అవమానాలు జరిగిన తర్వాత అటు పార్టీకి వ్యతిరేకంగా పనిచేయలేక, ఇటు నమ్మకం లేనివారి తరఫున ప్రచారం చేయలేక నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి పోలింగ్ ముగిసేవరకు ఇంటికే పరిమితమయ్యామని నాయకులు చెబుతున్నారు.

'పాగాల' ఇకలేరు

విద్యార్థి దశలోనే నాయకుడిగా.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకైన పాత్ర.. కేసీఆర్‌కు సన్నిహితుడు.. పార్టీలో తనకంటూ ఓ ప్రత్యేకత.. పలు పదవులు చేపట్టి వాటికే వన్నెతెచ్చిన 'పాగాల' ఇక లేరు.. 'తమ్మీ' అనే పదం ఇక వినిపించదని తెలిసి జీర్ణించుకోలేకపోతున్నారు కార్యకర్తలు, అభిమానులు.



జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి మృతదేహం



కేసీఆర్‌తో పాగాల (ఫైల్)

జనగామ జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం

- ఇటుక బట్టీల వ్యాపారం నుంచి.. జిల్లా పరిషత్ చైర్మన్ వరకు రాజకీయ ప్రస్థానం
- తెలంగాణ ఉద్యమంలో ముఖ్యభూమిక
- మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు, నేతల సంతాపం
- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు

జనగామ/చిల్పూరు: తెలంగాణ ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడు, పార్టీలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్న బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి(59) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. హనుమకొండ జిల్లా కాజీపేట చైతన్యపురిలోని నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలిపోగా కుటుంబ సభ్యులు సమీపంలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. పాగాల మృతి చెందారన్న సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. కాగా.. ఆస్పత్రిలో సంపత్‌రెడ్డికి చికిత్స అందించే క్రమంలో భార్య, కూతురు స్పృహ తప్పి పోవడంతో వెంటనే వారికి ప్రాథమిక చికిత్స చేశారు.

విద్యాభ్యాసం.. రాజకీయ ప్రస్థానం

చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి చెందిన పాగాల జయపాల్‌రెడ్డి, సుకన్య దంపతులకు 1965లో మొదటి సంతానంగా సంపత్‌రెడ్డి జన్మించారు. స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసి హనుమకొండలోని బంధువుల ఇంట్లో ఉంటూ.. 8, 9, 10 తరగతులతో పాటు డిగ్రీ పూర్తి చేశారు. ఇక్కడ విద్యార్థి సంఘం నాయకుడిగా చురుకైన పాత్ర పోషించిన సంపత్‌రెడ్డి డిగ్రీ, ఐటీ కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత హైదరాబాద్‌కు వెళ్లి ఓ కాంట్రాక్టర్ వద్ద నెలకు రూ.4వేలకు పని చేశారు. ఆ కొలువు నచ్చక తిరిగి తల్లిదండ్రుల వద్దకు వచ్చారు. తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ ఇటుక బట్టీల వ్యాపారం ప్రారంభించారు. 1992లో సుజాతతో వివాహం కాగా.. కుమారుడు సాయి, కూతురు సంజనారెడ్డి జన్మించారు. కుటుంబ బాధ్యతలు పెరగడంతో సొంతంగా ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ ఇటుకల వ్యాపారంతో ముందుకుసాగారు.

తెలంగాణ మలిదశ ఉద్యమంలో..

2001లో ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని మొదలు పెట్టిన కేసీఆర్ పిలుపుతో సంపత్‌రెడ్డి గులాబీ కండువా కప్పుకుని ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గుండె విజయరామారావు గెలుపునకు కృషి చేశారు. 2006లో టీఆర్ఎస్‌వీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, 2007 నుంచి 2013 వరకు స్టేషన్ ఘన్‌పూర్ మండల అధ్యక్షుడిగా పని చేశారు. 2013లో పార్టీ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ, 2013–15 వరకు నియోజవర్గ ఇన్‌చార్జ్‌గా పని చేసిన ఆయన.. 2016 నుంచి 2019 జూలై వరకు చిల్పూరు మండల అధ్యక్షుడిగా సేవలందించారు. అంతకు ముందు 2018లో రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడిగా పని చేశారు. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున పోటీ చేసి చిల్పూరు నుంచి జెడ్పీటీసీగా విజయం సాధించారు.

2019లో జెడ్పీ చైర్మన్.. 2022లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా..

2019లో చిల్పూరు నుంచి జెడ్పీటీసీగా గెలుపొందిన తర్వాత అదే ఏడాది సీఎం కేసీఆర్ నిర్ణయంతో జూలై 5న జనగామ జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ పదవిలో కొనసాగుతుండగానే 2022 జనవరి 22న పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల మంత్రి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కేడర్‌ను సమన్వయం చేస్తూ.. కేసీఆర్ దృష్టిలో గుర్తింపు పొందారు.

దూరమైన కొడుకు

తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో సంపత్‌రెడ్డి కేసీఆర్ దృష్టిలో పడ్డారు. ఆయన ప్రతి పిలుపులో 'పాగాల' ముందుండి పోరాడారు. ఉద్యమ సమయంలో తన కుమారుడు సాయి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. బాధను దిగమింగుకుని కేసీఆర్ ఆశయ సాధనలో ముందుకు నడిచారు. తెలంగాణ పోరు సమయంలో 28 కేసులతో పాటు జైలు జీవితం గడిపారు. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో సైతం చిన్న పెండ్యాల, రాజవరం, నష్కల్, వంగాలపల్లి గ్రామాలను కలుపవద్దంటూ రాస్తారోకోలు, రైల్ రోకోలు చేపట్టారు. ఈ ఉద్యమంలో ఒక రైల్వే కేసు, 4 రాస్తారోకో కేసులు నమోదు కాగా, ఇటీవలే కొట్టి వేశారు.

'తమ్మీ' అనేదెవరు?

సంపత్‌రెడ్డి నోటి వెంట వచ్చే మొదటి పదం తమ్మీ. ఎవరు కనిపించినా తమ్మీ బాగున్నావా.. ఊరిలో పార్టీ ఎలా ఉందంటూ ఆప్యాయంగా పలకరించే వారు. సంపత్‌రెడ్డి అకాల మరణంతో తమ్మీ అని ఎవరు పిలుస్తారంటూ పార్టీ శ్రేణులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఇదిలా ఉండగా.. ఇటీవలి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలు కావడంతో ఆ విషయాన్ని మిత్రులు, తోటి నాయకుల వద్ద చెప్పుకుని బాధపడ్డాడని, ఆ ఆవేదనతోనే గుండెపోటు వచ్చినట్లు పలువురు పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులు, పలువురి నివాళి

సంపత్‌రెడ్డికి గుండెపోటు వచ్చిందన్న వార్త తెలుసుకున్న జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి హనుమకొండ రోహిణి ఆస్పత్రికి వెళ్లారు. అప్పటికే పాగాల మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించడంతో కన్నీటి పర్యంతమయ్యారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాలు, ఇతర పార్టీల నాయకులు, అధికారులు అన్ని వర్గాల ప్రజలు నివాళులర్పించారు. ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని స్వగ్రామం రాజవరానికి తీసుకురావడంతో అభిమానులు, గ్రామస్తులు తండోపతండాలుగా కడసారి వీడ్కోలు పలికేందుకు తరలివస్తున్నారు. కాగా.. కూతురు సంజనారెడ్డి ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లగా.. ఇటీవల ఎలక్షన్ల సందర్భంగా ఓటు వేయడానికి ఇండియాకు వచ్చారు. కొద్ది రోజుల్లో యూఎస్ఏకు వెళ్లనున్న తరుణంలో తండ్రి అకాల మరణం ఆమెను పుట్టెడు దుఃఖంలో నింపింది. పాగాల మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా మంగళవారం(నేడు) అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు పల్లా, కడియం

మాజీ సీఎం కేసీఆర్ సంతాపం

జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి మృతికి మాజీ సీఎం కేసీఆర్ తన ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

ఆ భూములు స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములు చాలావరకు కబ్జాకు గురయ్యాయని, అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. స్థానిక ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా తీర్పును స్వాగతిస్తున్నామని, ప్రతిపక్ష హోదాలో ప్రజలకు అండగా ఉండి వారి సమస్యలపై పోరాడుతామన్నారు. కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని, రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. హైదరాబాద్‌లో అభివృద్ధిని చూసి వేటు వేయడం వల్ల అక్కడ గెలిచామన్నారు. గ్రామీణ జిల్లాల్లో ఎలా ఓడిపోయామో అర్థం కావడం లేదన్నారు. కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని, ఇకనుంచి జిల్లాలోనే అందుబాటులో ఉంటానని చెప్పారు. జిల్లాకేంద్రంలో బాబాగుట్ట వెనుక కబ్జాకు గురైన ఆరు ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. రవికుమార్, కన్నా, వెంకన్న, వేణు, కరుణాకర్‌రెడ్డి, వెంకటాద్రి, శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రద్దీగా రైళ్లు



డోర్నకల్: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో డోర్నకల్ మీదుగా నడిచే రైళ్లన్నీ రద్దీగా మారాయి. దూరప్రాంతాల నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంత గ్రామాలకు వచ్చినవారు సోమవారం పెద్ద సంఖ్యలో తిరుగు ప్రయాణమన్నారు. దీంతో రైళ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా వరంగల్, హైదరాబాద్ వైపునకు వెళ్లే రైళ్లలో రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

'ఓపెన్ స్కూల్' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

విద్యారణ్యపురి: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) ఈఏడాది అక్టోబర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించిన టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను సోమవారం డైరెక్టర్ శ్రీహరి విడుదల చేశారు. ఈ మేరకు వివరాలను హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై, ఉమ్మడి వరంగల్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు వెల్లడించారు. సంబంధిత పరీక్షల ఫలితాలను 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్‌స్కూల్, ఓఆర్‌జీ' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి రీకౌంటింగ్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.350, రీ వెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.1200, ఇంటర్మీడియట్ ప్రతి సబ్జెక్టుకు రూ.400, రీ వెరిఫికేషన్‌కు రూ.1200 చొప్పున ఈనెల 7నుంచి 16వ తేదీ వరకు మీసేవా కేంద్రాల్లో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ కోఆర్డినేటర్ శంకర్ రావును(8008403631) సంప్రదించాలని సూచించారు.

భర్త వేధింపులు తాళలేక..

- వివాహిత ఆత్మహత్య



మౌనిక (ఫైల్)

నల్లబెల్లి: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని రాంపూర్‌లో జరిగింది. ఎస్సై నైనాల నగేష్ కథనం ప్రకారం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం చిన్ననెమలి గ్రామానికి చెందిన సూరినేని లక్ష్మి, సోమేశ్వర్ రావు దంపతుల కూతురు మౌనిక (30), రాంపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ పురం సారంగపాణి 14 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్నాళ్లు వీరి దాంపత్య జీవితం సజావుగానే సాగింది. ఇటీవల సారంగపాణి మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని భార్యను తరుచూ వేధిస్తున్నాడు. ఈ విషయమై పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి సారంగపాణిని మందలించారు. అయినా అతడిలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ క్రమంలో సోమవారం మరోమారు భార్యతో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన మౌనిక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ చోర్..జరభద్రం



పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు

- కేటుగాళ్ల ఉచ్చులో బాధితులు
- చిన్న తప్పిదం.. భారీ మూల్యం
- క్లిక్ చేస్తే క్షణాల్లో అకౌంట్ నుంచి డబ్బులు మాయం

కాజీపేట: సాంకేతిక వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. కీప్యాడ్ ఫోన్ నుంచి మొదలు.. స్మార్ట్ ఫోన్ వరకు విరివిగా వినియోగం జరుగుతోంది. ఈ క్రమంలో చిన్న తప్పిదం మోసగాళ్ల ఉచ్చులో పడేలా చేస్తోంది. ఆ తప్పిదం తెలుసుకునేలోపు తీవ్ర నష్టం జరుగుతోంది. ఈ ఘటనను కొందరు బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్తుండగా.. మరికొందరు పరువుపోతుందని ఎవరికీ చెప్పకుండా మానసికంగా కృంగిపోతున్నారు.

అశ్లీల చిత్రాలతో బెదిరింపులు...

ప్రస్తుతం సెల్‌ఫోన్ వినియోగించని వ్యక్తి లేడంటే అతియోశక్తి కాదు. సెల్‌ఫోన్‌పై అవగాహన లేని వారిని వలలో వేసుకునేందుకు ఆన్‌లైన్‌లో మోసగాళ్లు పొంచి ఉన్నారు. ఏ చిన్న అవకాశం లభించినా ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తూ సెల్‌ఫోన్‌తో లింకు ఉన్న బ్యాంకు ఖాతాలో డబ్బులు మాయం చేస్తున్నారు. ఇంతటితోనే ఆగకుండా సెల్‌ఫోన్‌కు అశ్లీల చిత్రాలు పంపించి బెదిరిస్తున్నారు. అలాగే, తమ సన్నిహితుల నంబర్లకు అశ్లీల వీడియోలు పంపిస్తామని వేధిస్తారు. వారి నుంచి తప్పించుకునేందుకు దారి దొరకక చాలా మంది మనోవేదనకు గురవుతున్నారు.

యువత ఆలోచించాలి..

యువత సెల్‌ఫోన్ వినియోగంలో మంచి, చెడు గురించి ఆలోచించాలి. సెల్‌ఫోన్‌లో వచ్చే అనవసరమైన లింకులు క్లిక్ చేయొద్దు. ఆన్‌లైన్ రుణాలు యాప్‌ల జోలికి వెళ్లొద్దు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వాట్సాప్‌లో వీడియో కాల్స్‌కు స్పందించొద్దు. ఇందులో ఏది చేసినా సెల్‌ఫోన్ హ్యాకర్ల చేతిలోకి వెళ్తుంది. ఆ తర్వాత పర్యావసానం తీవ్రంగా ఉంటుంది. మోసపోయామని తెలిస్తే 1930 నంబర్, లేదా www.cybercrime.gov.in లో సంప్రదించాలని పోలీసులు ఎంత ప్రచారం చేస్తున్నా ఇంకా అనేక మంది ఇంకా నష్టపోతుండడం గమనార్హం.

ఉదాహరణకు కొన్ని ఘటనలు..

- కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన యువకుడు హ్యాకర్లకు చిక్కాడు. వారి నుంచి వేధింపులు ఎదుర్కొన్నాడు. తన ఫొటోలను మార్ఫింగ్ చేసి భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో భయపడిపోయిన సదరు యువకుడు కుటుంబీలకు తెలియకుండా రూ. లక్షల్లో ముట్టజెప్పాడు. హ్యాకర్లను గుర్తించి శిక్షించాలని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- కాజీపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తి రుణ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. వారం కాల పరిమితితో రెండు దఫాలు రుణం పొందాడు. తీసుకున్న రుణం వడ్డీతో సహా తిరిగి చెల్లించాడు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఒకరోజు ఆయన సెల్‌ఫోన్‌కు ఒక ఫొటో వచ్చింది. అది తెరచి చూడగా బాధితుడి ఫొటోతో కూడిన అశ్లీల చిత్రాలు పంపించారు. బాధితుడు వెంటనే పోలీసులను ఆశ్రయించగా సెల్‌ఫోన్ హ్యాక్ అయింది.. ఏం చేయలేం అని చెప్పడంతో మరింత ఒత్తిడికి గురయ్యారు. వెంటనే తన నంబరు తొలగించి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు.
- ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ ఆన్‌లైన్ ఉద్యోగాల ప్రకటన చూసి దానిపై క్లిక్ చేశారు. వారు చెప్పిన వివరాలు పొందుపరిచారు. కొంత డబ్బు చెల్లించాల్సి ఉంటుందని వారు చెప్పగా పంపించారు. ఇలా పలుమార్లు అడగడంతో మోసపోయినట్లు గుర్తించారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా వేధింపులకు పాల్పడ్డారు. తేరుకుని పోలీసులను ఆశ్రయించినా నష్టం అప్పటికే జరిగింది.

జాగ్రత్తగా ఉండాలి..



స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తున్న వ్యక్తులు అనవసర విషయాల జోలికి వెళ్లొద్దు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసపోయిన తర్వాత బాధపడడం కన్నా ముందే జాగ్రత్త పడితే నష్టాన్ని నివారించుకోవచ్చు.

\- సార్ల రాజు, సీఐ, కాజీపేట

పోస్టుమార్టం



- ఎన్నికల ఫలితాల సమీక్షలో అభ్యర్థులు
- పోలింగ్ బూత్‌ల వారీగా పరిశీలన
- ఓట్లు తక్కువ రావడంపై కారణాల విశ్లేషణ

హన్మకొండ: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో గెలుపు, ఓటములపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించి ఫలితాలను విశ్లేషిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లను పరిశీలిస్తున్నారు. ఎక్కడ లోటు ఏర్పడింది.. ఎక్కడ మెజారిటీ వచ్చింది.. ఏఏ కారణాలతో ఓట్లు రాబట్టుకోలేక పోయాం .. అనే అంశాలపై చర్చించుకుంటున్నారు. గెలిచిన అభ్యర్థులకు మెజారిటీ ఎందుకు తగ్గింది.. ఏ గ్రామంలో, ఏ వార్డులో, ఏ డివిజన్‌లో, ఏ పోలింగ్ బూత్‌లో తక్కువ పడ్డాయనే దానిపై ఆరా తీస్తున్నారు. తక్కువ రావడానికి కారణాలేమిటో తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 నియోజకవర్గాలకు గాను 10 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, 2 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయారు. ఓడిన అభ్యర్థులు తమ బలహీనతకు కారణాలేమిటో పోలింగ్ బూత్‌ల వారీగా అంచనా వేస్తున్నారు. ప్రభావితం చేసినచోట ఓట్లు వచ్చాయా లేదా అని పరిశీలిస్తున్నారు. ప్రలోభాలకు గురిచేసినా ఎందుకు ఓట్లు రాలేదో కారణాలను తెలుసుకుంటున్నారు. కొద్దిగా కష్టపడితే బాగుండేది అని బాధపడుతున్నారు. నాయకులు, కార్యకర్తలు పని చేయలేక పోవడం చేతనే మైనస్ అయ్యాయా అని ఆరా తీస్తున్నారు. అభ్యర్థుల అనుచరులు, పార్టీల ముఖ్య నాయకులు పోలింగ్ బూత్‌ల వారీగా వివరాలు ముందు పెట్టుకుని సీరియస్‌గా సమీక్షిస్తున్నారు. గతంలో జరిగిన సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఓట్లు, ప్రస్తుత తాజా ఎన్నికల నాటికి పోలైన ఓట్లను సమీక్షించుకుంటూ వైఫల్యాలను వెతుక్కుంటున్నారు.

'డబుల్' ఇళ్లలోకి వెళ్లేందుకు యత్నం..

- గుడిసెవాసులను అడ్డుకున్న పోలీసులు
- రోడ్డుపై బైఠాయించి నిరసన



నిరసన తెలుపుతున్న గుడిసెవాసులు

హన్మకొండ అర్బన్: సుమారు ఆరేండ్ల క్రితం ప్రభుత్వం నగరంలోని బాలసముద్రంలోని అంబేద్కర్‌నగర్, జితేందర్‌సింగ్‌నగర్‌లో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇప్పటికీ కేటాయించలేదు. దీంతో స్థానిక గుడిసె వాసులు ఆ ఇళ్లలోకి వెళ్లేందుకు సోమవారం సిద్ధమయ్యారు. ప్రభుత్వం మారిన ఇండ్ల కేటాయింపు విషయంలో ఎలాంటి సమాచారం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో గుడిసెవాసులు ప్రెస్‌క్లబ్ సమీపంలోని రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. పోలీసులు వారిని సముదాయించి అక్కడి నుంచి పంపించారు.

'కత్తెర' కాటు..

- మొక్కజొన్న పంటలో విజృంభిస్తున్న గొంగళి పురుగు
- ఆందోళనలో రైతులు



కరీమాబాద్: యాసంగిలో మొక్కజొన్న పంటను 'కత్తెర' కాటు వేస్తోంది. ఫలితంగా ఈ పంట సాగు చేస్తున్న రైతులను భయం వెంటాడుతోంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న రైతులకు మొక్క దశలోనే కత్తెర పురుగు వెంటాడుతుండడం సమస్యగా మారుతోంది. మొక్కలు 30 రోజుల వయసులో ఉండగా పురుగు ఆశిస్తుండడంతో రైతులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఎదురవుతోంది. పత్తి పంట ఆశించిన రీతిలో దిగుబడి రాని రైతులు నీటి సౌకర్యం ఉండడంతో యాసంగిలో మొక్కజొన్న పంట వేశారు. అయితే రైతులు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు సస్య రక్షణ చర్యలు తీసుకుంటే నష్టాల బారిన పడకుండా ఉండొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గొంగళి పురుగును గుర్తించడం ఎలా..

గొంగళి పురుగు చూడడానికి పొగాకు లద్దె పురుగు మాదిరిగానే ఉన్నప్పటికీ ముఖంపై ×వై౯ ఆకారంలో తెల్లని చార కలిగి ఉంటుంది. గొంగళి పురుగుపై నాలుగు చుక్కలు ఉంటాయి. ఈ పురుగు రాత్రి వేళల్లో మొక్కజొన్న ఆకులు, కాండంపై గుడ్లు పెడుతుంది.

ఎలా నష్టం చేస్తుందంటే..

మొదటి దశ గొంగళి పురుగులు ఆకులపై పత్రహరితాన్ని గోకి తింటూ ఆకులపై రంధ్రాలను చేస్తుంది. మొదటి దశ లార్వా ఆకుల చివరలో నుంచి తింటూ ఆకులపై కత్తిరించినట్లు కనిపిస్తూ ఆకులను పూర్తిగా తింటాయి. కాండాన్ని కూడా తొలిచి రంధ్రాలు చేసి మొక్కజొన్న కంకి లేత కండె భాగాన్ని కూడా తింటాయి.

నివారణ మార్గాలు..

1. లోతు దుక్కులు దున్నుకోవడం వలన పురుగు కోశస్థ దశలు నాశనమవుతాయి.
2. పంట చుట్టూ నాలుగు వరుసలు నేపియర్ గడ్డిని ఎర పంటగా వేసుకోవాలి.
3. ఎకరానికి 4–5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని పురుగు ఉనికిని గమనిస్తుండాలి.
4. గుడ్ల సముదాయాలను గుర్తించి ఏరివేసి నాశనం చేయాలి.
5. కత్తెర పురుగు గుడ్లను ఆశించే ట్రైకోగ్రామ బదనికలను ఎకరానికి 20 వేల చొప్పున పొలంలో విడుదల చేయాలి.
6. గుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి ఒక లీటరు వేప నూనెను, వేప గింజల కషాయం పిచికారీ చేయాలి.
7. తొలిదశ గొంగళి పురుగులను నివారించేందుకు ఎకరానికి 500 ఎంఎల్ క్లోరోపైరిపాస్, 400 ఎంఎల్ క్వినాల్‌పాస్ మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలి.
8. గొంగళి పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే ఎమామెక్టిన్ బెంజోయేట్, స్పైనోశాడ్ మొక్కసుడులు, మొవ్వ లోపలి ఆకులకు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.
9. ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు విషపు ఎరను 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం 2 లీటర్ల నీటిలో పులియబెట్టి 100 గ్రాముల థయోడికార్బ్ మందును జోడించి సాయంత్రం వేళల్లో మొవ్వలో వేయాలి.
10. అవసరం మేరకు 2 –3 సార్లు మందును మార్చి మార్చి పిచికారీ చేయాలి. ఈ పురుగు మందులు ఒకే రకానికి చెందినవి కాకుండా చూసుకోవాలి.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



యాసంగిలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు జాగ్రత్తగా ఉండాలి. మొక్కలను ఎప్పటికప్పుడు గమనిస్తూ గొంగళి (కత్తెర) పురుగు ఆనవాళ్లను గుర్తించాలి. పురుగు ఉధృతి పెరగక ముందే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు పురుగు మందులు పిచికారీ చేస్తూ నివారణ చర్యలు చేపట్టాలి.

\- డాక్టర్ రాజు. శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

మద్యం దుకాణం ఎత్తివేయాలి



ధర్నా చేస్తున్న మహిళలు

- షాపు ఎదుట మహిళల ధర్నా

పరకాల: పట్టణంలోని కనకదుర్గమ్మ దేవాలయం సమీపంలో ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయానికి 100 మీటర్ల దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలనే నిబంధనను ఉల్లంఘించినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకపోవడం లేదని మండిపడ్డారు. దీనిపై ఇప్పటికైనా వెంటనే స్పందించి మద్యం దుకాణం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

'మిచాంగ్' ముప్పు..

- ముంచుకొస్తున్న తుపాను
- రైతులు జాగ్రత్తలు పాటించాలి
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి



మహబూబాబాద్ రూరల్: నైరుతి బంగాళాఖాతం మీదుగా ఏర్పడిన 'మిచాంగ్' తుపాన్ గత 6 గంటల్లో 5 కేఎంపీహెచ్ వేగంతో వాయువ్య దిశగా కదిలింది. ఈ తుపాను ప్రభావంతో రాగల మూడు రోజులు ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి, వరంగల్ జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలతోపాటు ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది. అందువల్ల రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి, జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఉషశ్రీ సూచించారు.

కోతలు వాయిదా వేయాలి

రైతులు వరికోత విషయంలో వ్యవసాయ వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వారి కోత చేపట్టాలి. వీలైనంత వరకు వరి కోతలు తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిది. వరికోత అయిన వరి ధాన్యపు రాశులు తడవకుండా టార్పాలిన్ పట్టాలతో గానీ, యూరియా బస్తాల పట్టాలతో గాని కప్పి భద్రపరుచుకోవాలి. ఆరుతడి పంటలకు నీటి తడులు ఇవ్వడం తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి. వర్షసూచన ఉన్నందున పురుగు మందుల పిచికారీ, రసాయనిక ఎరువులు వేయడం తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి. ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు మెరుపులు వచ్చే సమయంలో మొబైల్ టవర్ల కింద ఉండడం, మొబైల్ ఫోన్లు వాడటం, టీవీలు చూడడం, విద్యుత్ మోటార్లు ఆన్ చేయడం వంటివి చేయకూడదు. పశువులను వీలైనంత వరకు షెడ్ కింద ఉంచాలి

ఐఎంఏ అధ్యక్షుడిగా అన్వర్‌మియా



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

ఎంజీఎం: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ మహ్మద్ అక్బర్ మియా(అన్వర్‌మియా) ఎన్నికయ్యారు. 2023–24 కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు డాక్టర్ బాలాజీ, బందెల మోహన్‌రావు, ఆనంద్ బోక్రై తెలిపారు. అలాగే 2024–25 అధ్యక్షుడిగా(ఎలక్ట్ ప్రెసిండెంట్) కె.నాగార్జునరెడ్డిని ఎన్నుకున్నారు. ప్రస్తుత నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా డాక్టర్ అజిత్ మహమ్మద్, కొలిపాక వెంకటస్వామి, డాక్టర్ సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శిగా బింగి శ్రీనివాస్, కోశాధికారిగా డాక్టర్ దిడ్డి శ్రవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా వి.నరేశ్‌కుమార్, రామకృష్ణ, అడ్డబోయిన అనిత ఎన్నికయ్యారు.

రాష్ట్ర కమిటీ సభ్యుల ఎన్నిక

ప్రతీ ఏడాది రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లే ఈ ఏడాది సైతం 24 మంది రాష్ట్ర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. డాక్టర్ సనత్‌కుమార్, మహేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, భాస్కర్, శ్రీధర్, రవీందర్‌రెడ్డి, అశ్రిత్‌రెడ్డి, మధు, శాంతన్‌కుమార్, కూరపాటి మధు, ముక్క దిలీప్‌కుమార్, ప్రభాకర్, సుధాకర్, మంతెన శిరీష, బానోతు బలరాం, కృష్ణారావు, కవి, శేష/మాధవ్, డాక్టర్ పి.ప్రవీణ్, లక్ష్మీనారాయణ, ఎం.పవన్‌కుమార్, వి.రాకేశ్, డి.రాకేశ్, డి.రమేశ్‌కుమార్ ఎన్నికయ్యారు. సెంట్రల్ కమిటీ సభ్యులుగా బేతిక కవిత, రమాదేవి, శ్రీనివాసవర్మ ఎన్నికైనట్లు ఎన్నికాల అధికారులు తెలిపారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి : మహబూబాబాద్ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 150 మందికి పైగా ఆర్చరీ క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా, పర్వతగిరి మండలం కల్లెడ ఆర్డీఎఫ్ కళాశాల విద్యార్థులు రికర్వ్ విభాగంలో ఆరుగురు, ఇండియన్ రౌండ్ విభాగంలో ఏడుగురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జనార్దన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయి పోటీలు ఈనెల 8నుంచి 12వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలో ఉంటాయని తెలిపారు. ఈ పోటీలకు ఆర్డీఎఫ్ ఆర్చరీ అకాడమీ నుంచి 13మంది ఎంపికైనట్లు తెలిపారు. జనార్దన్, రాజు, కోచ్ చందులాల్, జయదాస్, ఏఓ ఏకాంబ్రం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సమయపాలన పాటించకుంటే గైర్హాజరే..

- కేయూ వీసీ రమేశ్
- క్యాంపస్‌లో పలు విభాగాల తనిఖీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిపాలనా భవనంలోని అకడమిక్ ఆడిట్, ఆడిట్ అండ్ అకౌంట్స్, పరీక్షల విభాగాలను వీసీ ఆచార్య తాటికొండ రమేష్ సందర్శించి తనిఖీ చేశారు. పరీక్షల విభాగంలోనూ పలు సెక్షన్లు తిరిగి ఉద్యోగుల హాజరును పరిశీలించినట్లు సమాచారం. సమయపాలన పాటించని, విధులకు ఆలస్యంగా వచ్చిన వారికి గైర్హాజరు వేయాలని సంబంధిత డ్రాయింగ్ ఆఫీసర్లను ఆదేశించినట్లు తెలిసింది. ఉద్యోగులు సమయ పాలన పాటించేలా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొనట్లు సమాచారం.

గుంతను తప్పించబోయి..

- చెట్టును ఢీకొన్న లారీ..
- డ్రైవర్ అక్కడికక్కడే మృతి



బోల్తాపడిన లారీ

రాయపర్తి: గుంతను తప్పించబోయిన ఓ లారీ చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలకేంద్రం శివారులోని కేసీఆర్ కాలనీ సమీపంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా నస్పెల మండలకేంద్రానికి చెందిన ఎండీ అఫ్రోజ్(50) ధాన్యంలోడ్‌తో తొర్రూరు వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కేసీఆర్ కాలనీ సమీపంలో గుంతను తప్పించబోయి వరంగల్, ఖమ్మం జాతీయ రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో లారీ కింద పడిన డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు జేసీబీ సాయంతో లారీని పైకిలేపి డ్రైవర్‌ను తీశారు. మృతదేహం పూర్తిగా నుజ్జునుజ్జయింది.

బోల్తాపడిన మరోలారీ..

చేపల లోడ్‌తో వెళ్తున్న మరోలారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున మండలంలోని మైలారం శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు నుంచి ఢిల్లీకి చేపల లోడ్‌తో వెళ్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ నిర్మల్, క్లీనర్ సతీష్‌కు స్వల్పగాయాలయ్యాయి.

బొలెరో ఢీకొని రైతు మృతి

ఏటూరునాగారం: బొలెరో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని రొయ్యూర్ సమీపంలో జరిగింది. రొయ్యూర్ గ్రామానికి చెందిన రైతు, బీఆర్‌ఎస్ నాయకుడు జాడి లక్ష్మణస్వామి(33) ద్విచక్ర వాహనంపై తన బావమరిది రమేష్‌తో కలిసి ఏటూరు నాగారం వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా 163 జాతీయ రహదారి మొదటి బ్రిడ్జి వద్ద ద్విచక్రవాహనాన్ని కొబ్బరి బొండాల లోడ్‌తో వెంకటాపురం(కె) వైపునకు వెళ్తున్న బొలెరో వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మణస్వామి అక్కడికక్కడే మృతి చెందగా రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులకు సమాచారం అందగా 108లో క్షతగాత్రుడిని ఎంజీఎంకు తరలించారు. లక్ష్మణస్వామి మృతదేహాన్ని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించినట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. లక్ష్మణస్వామి మిర్చి పంటకు పురుగుమందులు తీసుకొని వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య ఈశ్వరి, ముగ్గురు కుమారులు ఉన్నారు. కాగా, లక్ష్మణస్వామి మృతి చెందిన విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు.. మృతుడి కుటుంబీకులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జెడ్పీకోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, పార్టీ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, దుర్గం రమణయ్య, తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, కూనూరు మహేశ్, అంతటి నాగరాజు, చంద్రబాబు, రాంబాబు, భోజారావు ఉన్నారు.



లక్ష్మణస్వామి(ఫైల్)



సాత్విక్ మృతదేహం

విద్యుదాఘాతంతో బాలుడు..

ఎల్కతుర్తి: విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కేశవాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన చల్లా సాత్విక్(10) కాటారం 'ఏ వన్ కేమ్ బ్రాండ్' హైస్కూల్లో 3వ తరగతి చదవుతున్నాడు. దసరా సెలవులకు వచ్చి అప్పటి నుంచి ఇంటివద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన తన చెల్లి అవంతికతో పక్కింటి దాబాపై ఆడుకుంటున్నాడు. కాగా, సర్వీస్ వైర్ ఫెయిలై ఇనుప రాడ్‌కు కరెంట్ సరఫరా అవుతోంది. ఈ రాడ్‌ను పట్టుకున్న సాత్విక్‌కు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడే ఉన్న అవంతిక కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి చికిత్స నిమిత్తం బాలుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో తల్లిదండ్రులు బోరునా విలపించారు. ఈఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు.